(దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం విశ్వనాథ సత్యన్నారాయణగారికి జ్ఞానపీఠం బహుమతి లభించిందని విన్నాక వారి అనితర సాధ్యమైన శైలిని అనుకరించాలనే బుద్ధిపుట్టి వ్రాసిన కథ ఇది. వారు బ్రతికి వుండగా యీ కథను ప్రచురణకు పంపడానికి సాహసించలేక పోయాను: వారి శైలిని అనుకరించ గలిగాననీ సహృదయ పాఠకులు యే కొద్ది మంది తల వూపినా నా శ్రమ ఫలించిందనే భావిస్తాను. —రచయిత)

ఒకానొక గ్రామములో రామయ్య అనువొక రైతు వుండెను. ఒక గ్రామములో ఎందరో రామయ్యలుండ వచ్చును. మరి యీ రామయ్య ప్రత్యేకత యేమి? అతడందరి రామయ్యల వంటి వాడు గాదు! మంచితనము మూర్తీభవించినవాడు. తన పని యేదో తాను చూసుకొని మిగిలిన వారికి వీలైనంత సాయము చేసెడి వాడు!

ఈ కాలములో యింకా అటువంటి వారున్నారాయని మీకు సందేహము రావచ్చును. మంచివారు యీ కాలములో నేమి, అన్ని కాలములలోను వుందురు. ఒకానొక సమయమందు మంచి గుణమునకు గ్రహణము పట్టవచ్చును. లోకులు మంచి తనమును చెడ్డదిగా భావించ వచ్చును. ఆ కాలములో మంచితనము ప్రకాశవంతముగా లేదన్నమాట! అయిన నేమగును? నాటి సారస్వతము, చరిత్రలలో మంచితనము ప్రసక్తి వుండదు. అందువల్ల వాటినే ఆధారముగా చేసుకొని నేటి పండితులు ఆ కాలమున మంచితనమే లేదన వచ్చును! సరి! ఈ రామయ్య మంచితనము ఎక్కువగా ఉన్నవాడు!


రామయ్య తనకున్న నాలుగెకరముల కొండ్రను సాగు చేసుకొనెడివాడు. పంటల కాలమున పొలములోనే నివశించెడివాడు. పిల్లలు భోజనము తెచ్చి పెట్టగా భుజించి పాకలోనే యుండెడి వాడు. పొలములు పంటలతో నున్నప్పుడు యేమి జరుగును? ఎక్కడెక్కడి పశువులు మేయుటకు వచ్చును. మరి వానిని యజమానులు కట్టడిలో నుంచరా? కొంత మంది కట్టడి చేయుదురు. మరి కొందరు వూరు కొందురు. ఈ పశువులతో ఆ వూరిలోని గాడిదలు కూడా కొన్ని చేరెను.

గాడిదలు పశువులతో చేరినను గాడిద బుద్ధులు పోవుకదా! పశువులు తిన్నంత తిని తమ దారిన తాము పోవును. గాడిదలు అట్లు చేయవు! కడుపు నిండిన వెనుక అవి ఓండ్ర

# విశ్వనాథ వారు వ్రాయని కథ!

'కపి'





పెట్టును. గాడిదల ఓండ్రనుసహింపగల వాడెవ్వడు? వసుదేవుడే ఓండ్ర పెట్ట వద్దని గాడిద కాళ్ళు పట్టుకొనెను: మరి అందరూ అది చేయగలరా? చేయలేరు.

కనుక వారేమి చేసెదరు? తమ చేతి లోని బడితతోనో, రాళ్ళతోనో వాటిని కొట్టెదరు.

మన రామయ్యకూ చిన్నతనము నుండి గాడిదఓండ్రయన్న అసహ్యము. కనుక గాడిద ఓండ్ర పెట్టగానే చేతి లోని చేపాటి కర్రను సవరించి వాటిని తరిమి కొట్టెడి వాడు. ఒక వ్యక్తి వొక పని చేయుచున్నాడనుకొందము. ఆ పని వల్ల మనకునూ లాభ ముండు ననుకొందము. ఆ పనిని యెప్పుడూ మనమూ వ్యక్తికే వదలి వైచెదము. రామయ్య విషయములోనూ యిదే జరిగి నది. రామయ్యకు ఓండ్రయన్నగిట్టదు. కనుక అతను గాడిదలను తరిమి కొట్టు ను. ఇది మిగిలిన వారికి లాభము. కనుక వారు వూరుకొనెడి వారు. చివ రకు ఆ చుట్టుపట్ల యే పొలములో నికి గాడిద వచ్చినను రామయ్యయే తోలవలెనన్నది ఖాయమై పోయినది!

ఒక వ్యక్తి ఎంతో కాలము వొకే పనిని వోపికగా చేయలేడు. కొంత కాలమునకు విసుగు పొడ సూపును. బాధ కలుగును. యుక్తా యుక్త విచ క్షణా జ్ఞానము నశించును!

పొలములో కష్టపడి వచ్చిన రామయ్య విశ్రాంతి తీసుకొన నెంచును. గాఢ సుషుప్తిలో నుండగా మెలుకువ వచ్చును. ఐము గాడిద ఓండ్ర! గాఢ నిద్ర నుండి లేపబడిన యే వ్యక్తి కైనను విపరీతమగు కోపము వచ్చును. గాడిద పొలమున పంట మేయుట మొదటి కారణము. ఓండ్ర పెట్టుట రెండవ కారణము. అతడేమి చేయును? దగ్గరలో నేమున్న దానిని గాడిద వైపు కోపముగా విసరును!

ఒక రోజట్లే జరిగెను. కోపముతో రామయ్య తన దగ్గరలో నున్న గొడ్డలిని గాడిదల వైపు విసరెను. తరువాత కొం చెము సేపటికి అతని కోపము తగ్గెను. కోపము తగ్గగానే అతనికి గొడ్డలిని విసరినందుకు పశ్చాత్తాపము కలిగెను. గొడ్డలి వ్రేటుకు గాడిద మరణించె నేమొ, అందు వల్ల తనకు పాపము వచ్చును అనుభీతి కలిగెను!

అయిననేమయ్యె నన్నమాట? అతని మంచితనమునకు కొద్ది క్షణములు గ్రహణము పట్టెను. ఆ సమయ మందు అతను చెడ్డ వాడాయెను. అది తొలగ గానే అతను మంచి వాడాయెను. ఇట్లే యే కాలమందైనను జరుగును!

రామయ్య మెల్లగా పాక నుండి బయటకు వచ్చి చూచెను. పుచ్చపువ్వు వంటి వెన్నెల పచ్చని పొలములపై తళతళా మెరయుచున్నది. ఆకాశము నుండి దేవతలు వెండి కరిగించి భూమి పై గుమ్మరించు చున్నట్లున్నది. సకలచరా చర ప్రకృతి తెల్లటి వెన్నెలలో మునిగి పోయినది. కాని రామయ్యను యివి యే వియు ఆకర్షించలేదు. అతని దృష్టి యంతయు గాడిదలపై నున్నది. అతను భయపడినట్లే జరిగినది! అతని పాకకు కొంచెము దూరములో వొక గాడిద



పడియున్నది. ప్రక్కనే రామయ్య గొడ్డలి పడియున్నది! రామయ్య గుండె వొక్క క్షణము కొట్టుకొనుట మాని వేసెను!

అయిన తన గొడ్డలి వ్రేటునకు గాడిద మరణించెనన్న మాట. ఎంత పని జరిగినది! కోపముతో వొకప్రాణిని తాను నిష్కారణముగా హత్య చేసె నన్న మాట. ఈ పాపము పోవుటెట్లు? పిల్లి హత్యకు ప్రాయశ్చిత్తమున్నది. బ్రాహ్మణ హత్యకు ప్రాయశ్చిత్త మున్నది. మరి గాడిద హత్యకో? ఉండియే వుండును! దీనిని గురించి ఎవరినైన సంప్రదించవలయును. ఈ నాటి బ్రాహ్మణులు ప్రతి చిన్న పనికి ఎక్కువ ధనము ఖర్చగు ఉపాయమును చెప్పెదరు.

అయిన తానీ గాడిద హత్య గురించి వారికి చెప్పవలదా? చెప్పక పోయినను యీ దుష్కార్యము తన మనస్సు నెల్లప్పుడు బాధించుచుండును. కనుక చెప్పి ప్రాయశ్చిత్తము చేసుకొనుటయే మేలు! కాని యిది ప్రాయశ్చిత్తముతో వదలక పోవచ్చును. గాడిద స్వంత దారుడు దాని వెలను కోరవచ్చును. "చచ్చిన వాడి కళ్లు చేరెడేసి" అన్నట్లు ఆ చనిపోయిన గాడిద గుణగణములను

# జపాన్ దర్శనం!

అతి స్వల్ప కాలంలో అత్యంత అభివృద్ధి సాధించిన అపూర్వమైన దేశమది! పరిశుభ్రతని ప్రాణప్రదంగా ప్రేమించే అపురూప ప్రజలు వాళ్ళు! యుద్ధ విద్య (మార్షియల్ ఆర్ట్స్)లకి ఆదిపురుషులు ఆ నేల మీద పుట్టిన వీరులు! అక్కడ తయారైన గడియారాలు ప్రపంచమంతటా స్టేటస్ సింబల్‌గా మారాయి! భూగోళం మీద మొట్ట మొదటి అటంబాంబు పేలింది ఆ దేశం గుండెలమీదే! ఆ గాయం పూర్తిగా మానిందా? మూడు ద్వీపకల్పాల ముచ్చటైన దేశం జపాన్‌లో ఇటీవల పర్యటించి వచ్చిన ప్రముఖ రచయిత దాస్‌బాబు యాత్రారచన 'జపాన్ దర్శనం' వచ్చే సంచికలో....

యిబ్బడిముబ్బడిగా వర్ధించి అతడు అధిక వెల నడుగ వచ్చును!

ఈ ప్రాయశ్చిత్తపు ఖర్చుతో, గాడిదకీయవలసినవెలతో తనఈయేటి పంట సరిపోవచ్చును! మరి మిగిలిన సంవత్సరమంతయు నెట్లు గడుపవలెను?

అయినను ఆ గాడిద యిటు వైపున కేల రావలయును? వచ్చిన వచ్చినది. మేసిన మేసినది. ఓంద్ర యేల పెట్టవలయును? ఇంత పొలమును పాడు చేసితిని సుమా అని కేక వైచుటా అది? అయినను అది గొడ్డలి వ్రేటు దూరములోని కేల రావలయును?

ఇన్ని కార్యములు వరుసగా జరిగిన వన్న యేమన్న మాట? దాని కాలము తీరి పోయినది! కనుక మృత్యు చోదితయై అది యిక్కడకు వచ్చి చేరినది. అందువలన నా తప్పేమియు లేదన్న మాట. దైవ ప్రేరణ చేతనే నేను గొడ్డలి విసిరితినన్న మాట. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనను కుట్టదని వుండనే వున్నది కదా! ఈ గాడిద పూర్వ జన్మలో మానవుడై మరియొక గాడిదకు ఈ రకమైన మృత్యువును కలిగించి యుండవచ్చును. కర్మ సిద్ధాంతము తప్పించుకొన నెవరి తరము?

అయినచో వచ్చు జన్మలో నాకును యిదియే గతియా? అయిన కానిమ్ము! ప్రస్తుత మీ పశ్చాత్తాప కాండ వదిలించుకొన గలిగిన అదే పది వేలు. "బ్రతికున్న బలుసాకు తిన వచ్చును". తనకు మాలిన ధర్మము మొదలు చెడ్డదేరమని శాస్త్రకారులు చెప్పియే యున్నారు. "ప్రాణ విత్తమాన భంగమందు బొంకవచ్చునధిప" అని కూడా వారే చెప్పి యున్నారు. కనుక ప్రాయశ్చిత్తము వరకూ రాకుండగ ఈ చనిపోయిన గాడిదను ప్రక్క పొలము లోనికి యీడ్చి వేయుటయే ప్రస్తుత కర్తవ్యము.


మరి మనసు బాధ పడుటయో యందువా?-ఆ కార్యము నాచరించి నప్పుడు తాను మనిషి కాడు. అసురుడు. అసుర ప్రవృత్తి తొలిగినంతనే మానవుడాయెను. కనుక మానవ ధర్మ సూత్రముల ప్రకారము ప్రాణ, విత్త, మాన, భంగముల తొలగించుకొనుటయే తన కర్తవ్యము!

ఈ విధముగా అతని ఆలోచనలను వ్రాయుటకు యింత కాలమాయెను. కాని ఆలోచించుటకు అతనికి అయిదు నిముషముల కాలము మాత్రమే పట్టెను. మనో వేగమునకు దీటు వచ్చునదేది?

చివరకు దృఢ నిశ్చయముతో ఆ చచ్చిన గాడిదను ప్రక్క పొలము లోనికి యీడ్చి వేయుటకు అతను ఆయత్తుడై ముందుకు సాగెను. క్రిందకు వంగి దాని వెనుక కాళ్లు పట్టుకొని బలము కొద్దీ దానిని లాగబోయెను. ఇంతలో నొక మహా విచిత్రము సంభవించెను! ఆ గాడిద కదిలి తన సత్తువ కొలదీ రామయ్యను తన్ని శర వేగముతో ముందుకు పరిగెత్తెను! ❋







# చేతవెన్నముద్ద

— వాకాటి

"ఉడుముండదె నూరేండ్లును ?-" అన్నాడు కవి. ఉండడం, పడి వుండడం, ఎలాగో ఒకలాగున వుండడం అన్నది జీవచ్ఛవాల లక్షణం. అనుక్షణమూ స్పందిస్తూ, వెతుకుతూ, ఎదుగుతూ, విస్తరిస్తూ, చీకట్ల నెదిరిస్తూ, వెలుగులు వెదజల్లుతూ,

## నగర జీవిత సుఖ సంతోషాలను కాలదన్ని

# ఆఫ్రికా అరణ్యాలలో ఆసుపత్రి తెరిచిన అపూర్వ మానవతామూర్తి ఆల్బర్ట్ ష్వేయిట్జర్ !

"మానవ జన్మ అన్నది, ఇదుగో ఇందుకు!" అని నిర్వచిస్తున్నట్లుగా బ్రతకడం మనిషి లక్షణం.

అలాంటి మనిషి చేతులే అవి. అవి అక్కడ కీకారణ్యంలో గొడ్డలి చేతపట్టి వృక్షాలను నేలకూల్చి, ఆ చోటునంతా చదునుగా చేసి, ఆ వృక్షాలను కోసి పలకలుగా చెక్కి వాటితో చక్కటి ఇళ్ళను, వైద్యశాలలను నిర్మించాయి.

ఆ చేతులే శస్త్రచికిత్స పనిముట్లను సుతారంగా వాడి వందలాది జనుల బాధను తగ్గించాయి, మందుల నందించి వారి నారోగ్యవంతులను చేశాయి.

ఆ చేతులే ఆర్గాన్ వాయిద్యపు మెట్లమీద అలవోకగా నాట్యంచేసి పాశ్చాత్య శాస్త్రీయ సంగీత సుధలను వర్షించాయి.

ఆ చేతులే కలాన్ని పూని-"చారిత్రక దృష్ట్యా జీసస్", "జీసస్ మానసిక పరిశోధన", "ఒక పురాతన అర